నమస్తే తెలంగాణ

నల్లగొండ

3 | నల్లగొండ, గురువారం 15 ఆగస్టు 2024 | NALGONDA


## పంద్రాగస్టుకు సిద్ధం

- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి
- పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించనున్న మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండలో స్వాతంత్ర్య వేడుకలకు చేసిన ఏర్పాట్లు

నల్లగొండ/ నీలగిరి, ఆగస్టు 14: 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు అందుకు సిద్ధమైంది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గురువార ఉదయం 9 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా 9.30గంటలకు ప్రభుత్వ ప్రగతి, అభివృద్ధి, సంక్షేమంపై ప్రసంగిస్తారు. 9.40కి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 10గంటలకు లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, 10.15 గంటలకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల పంపిణీ ఉంటుంది. 10.30కు జాతీయ గీతాలాపనతో వేడుకలు ముగియనున్నాయి. పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్ బుధవారం పరిశీలించారు. అధికారులకు అవసరమైన సూచనలు ఇచ్చారు.



మాదక ద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఐజీ సత్యనారాయణ, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తదితరులు

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చాలి : కలెక్టర్ నారాయణరెడ్డి

నీలగిరి, ఆగస్టు 14 : మీ భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని, మంచి మార్గం వైపు పయనిస్తే సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి విద్యార్థులు, యువతకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన్‌పై బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో యువతను పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్య డ్రగ్స్ అని, మత్తు బారి నుంచి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే బయటకు రావడం కష్టమని తెలిపారు. విద్యార్థులు ఏ రంగంలో ప్రతిభ చాటవచ్చో గుర్తించి అటువైపు ప్రయాణించేలా చూడాలన్నారు. జీవితంలో ఏది సాధించాలన్నా కృషి, పట్టుదల అవసరమని పేర్కొన్నారు. కష్టపడే ఆలోచనా విధానంపై దృష్టి పెట్టాలని, మంచివారితో స్నేహం చేయాలని, చెడు అలవాట్లకు బానిస కావద్దని సూచించారు. మత్తు పదార్థాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. రెండో జోనల్ ఐజీ సత్యనారాయణ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల అన్ని దుష్పరిణామాలేనని, యువత మంచిని కోరుకునే వైపు వెళ్లాలని అన్నారు. చెడు వ్యసనాల వల్ల చెడుదారి పడుతారని, తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంపై దృష్టి పెట్టాలని సూచించారు. గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తున్నప్పటికీ సమాజమంతా సహకరించినప్పుడే అది సాధ్యమవుతుందని అన్నారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చేందుకు పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, చెడు వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్ కోల్పోతారని అన్నారు. జిల్లాలో గంజాయి వాడకం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఎవరూ గంజాయిని వాడవద్దని, దాని వల్ల జరిగే దుష్పరిణామాలు, ఆరోగ్యం చెడిపోయే తీరును ఆయన వివరించారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి, అదనపు ఎస్పీ రాములునాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్, డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, సీఐలు ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, డానియల్ కుమార్, ఎస్‌ఐలు రావుల నాగరాజు, సైదాబాబు, సురేశ్ పాల్గొన్నారు.

# కదిలించిన నమస్తే కథనం

## ప్రభుత్వ దవాఖానలకు అధికార యంత్రాంగం

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

- వైద్యాధికారుల నుంచి కలెక్టర్ల వరకు విజిట్
- వార్డులు, రికార్డుల పరిశీలన
- రోగులతో మాట్లాడి సమస్యలపై ఆరా..
- పరిష్కారం దిశగా ఆదేశాలు

**సమస్యల వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్న ప్రభుత్వ దవాఖానలపై నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా వైద్యారోగ్యశాఖ అధికారుల నుంచి మూడు జిల్లాల కలెక్టర్ల వరకు వివిధ సర్కారు ఆస్పత్రులను సందర్శించారు. వార్డులు, ల్యాబ్‌లు, మెడికల్ షాపులు, రికార్డులను పరిశీలించారు. దవాఖానల్లో కలియదిరుగుతూ రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి సూపరింటెండ్లకు అవసరమైన ఆదేశాలు ఇచ్చారు. దవాఖానల అవసరాలపై నివేదిక పంపాలని సూచిస్తూనే.. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వైద్య సిబ్బందిని హెచ్చరించారు. కాగా.. దవాఖానల్లో వైద్యులు, సిబ్బంది కొరత ఉందని పలు ఆస్పత్రుల డాక్టర్లు ఉన్నతాధికారుల ఎదుట వాపోయారు.**



ఆలేరు సీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

### కేసులు ఎక్కువ ఉన్న గ్రామాల్లో జ్వర సర్వే చేపట్టాలి

**ఆలేరు సీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ హనుమంతు కె.జెండగే**

ఆలేరు రూరల్, ఆగస్టు 14 : ఆలేరు పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ హనుమంతు కె.జెండగే బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యుల కొరత, సమయపాలన పాటించని వైద్య సిబ్బంది, వసతులు, జ్వరంతో చికిత్స పొందుతున్న రోగులు, పరీక్షలకు సంబంధించిన కిట్స్, ర్యాపిడ్ టెస్ట్ వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. పేషెంట్లకు కావాల్సిన మందులు ఉన్నాయా.. లేవా? జ్వరానికి సంబంధించి ఏ ప్రాంతం నుంచి ఎక్కువ కేసులు వస్తున్నాయి అని అడిగారు. ఎక్కువ కేసులు వస్తున్న ప్రాంతంలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో ఇంటింటా జ్వర సర్వే చేసి రోగాల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ స్వప్నరాథోడ్, వైద్యులు రహీం, శిరీష ఉన్నారు. రాజాపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



నల్లగొండ ప్రభుత్వ దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

### దవాఖా సమస్యలపై ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్

- నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి

నీలగిరి, ఆగస్టు 14 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఫిర్యాదుల బాక్స్, కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని నల్లగొండ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బుధవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డుల్లో కలియతిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవలు, నిల్వ ఉన్న మందుల వివరాలు, టెస్టుల గురించి ఆరా తీశారు. డాక్టర్ల సమయపాలన, కొరత, సిబ్బందిపై పనిభారంపై విచారణ చేశారు. ఏఏ మండలాల నుంచి జ్వర పీడితులు ఎక్కువగా వస్తున్నారో నివేదిక సమర్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణమూర్తిని ఆదేశించారు. ఆసుపత్రిలో మందుల నిల్వలు.. ఫ్లూయిడ్స్, యాంటీ బయోటిక్స్ ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ రిపోర్టును పరిశీలించి టీ హబ్‌కు రోజు ఎన్ని టెస్టులు వస్తున్నాయి.. అన్ని పరీక్షలు చేస్తున్నారా? ఎక్కువ శాంపిల్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయని అడిగారు. మిర్యాలగూడ, దేవరకొండ, సాగర్ నుంచి ఎక్కువ శాంపిల్స్ వస్తున్నాయని నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. టెస్టుల్లో తప్పులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. రోగుల పట్ల సౌమ్యంగా ఉండాలని, ఎవరినీ దుర్భాషలాడవద్దని సూచించారు. అనంతరం శానిటేషన్ సిబ్బంది, నర్సులు, ఏఎన్‌ఎంలు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పర్మినెంట్ ఉద్యోగుల విధుల నిర్వహణపై ఆరా తీశారు. రోగుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ రమణమూర్తి, జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ శ్యాంసుందర్ జాదు ఉన్నారు.



సూర్యాపేట ఏరియా హస్పిటల్‌లో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

### రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేట, ఆగస్టు 14 : ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు సరైన వైద్యం అందించి వ్యాధులను నయం చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. పేషెంట్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని వైద్య సిబ్బందిని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో తిరిగి రోగులకు అందుతున్న వైద్యం, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అన్ని రకాల మందులు ఉన్నాయా.. లేవా? అని సూపరింటెండెంట్‌ను అడిగారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో పేషెంట్లకు ఇబ్బందులు లేకుండా వైద్యం అందించాలన్నారు. టెస్టింగ్ కిట్స్, బెడ్లు, మందులు లేకుంటే తనకు నివేదిక పంపాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్, ఆర్ఎంఓ డాక్టర్ జనార్దన్, డాక్టర్ గిరిధర్ ఉన్నారు.

#### 100 పడకల ఆసుపత్రికి త్వరలోనే పరిష్కారం

తిరుమలగిరి (తుంగతుర్తి) : తుంగతుర్తి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గదులు, స్టోర్ రూమ్‌ను పరిశీలించి మందుల స్టాక్ వివరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు నిరంతరం అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణం ఆయిగిపోయిన విషయం జిల్లా మంత్రి దృష్టికి తీసుకెళ్లానని, త్వరలో పరిష్కారం అవుతుందని కలెక్టర్ అన్నారు. రోగుల రక్త నమూనాలను జిల్లా ఆసుపత్రికి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మల్‌కుమార్, తాసీల్దార్ కంటమయ్య, ఎంపీడీఓ శేషుకుమార్, ఎంఈఓ బోయిన లింగయ్య ఉన్నారు.

## ఎత్తిపోతల పనులకు బ్రేక్

- సాగర్ వెనుక జలాలతో నిలిచిన పనులు
- ఆరు నెలల దాకా అంబాభవానీ, కంబాపల్లి లిఫ్ట్ పనులు లేనట్టే

చందంపేట, ఆగస్టు 14 : ఉమ్మడి చందంపేట మండలంలో దాదాపు 4 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో నిర్మిస్తున్న అంబాభవానీ, కంబాలపల్లి ఎత్తిపోతల పనులు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి లేదు. కృష్ణా నది పైనున్న ప్రాజెక్టుల నుంచి వరద పోటెత్తుండడంతో నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దాంతో వెనుక జలాలు ఎత్తిపోతల పనులు జరుగుతున్న ప్రదేశం వరకూ వచ్చాయి. ఫలితంగా పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. జనవరి లేదా ఫిబ్రవరి వరకు సాగర్ వెనుక జలాలు తగ్గితే తప్ప పనులు కొనసాగించలేమని అధికారులు చెప్తున్నారు. రూ.186 కోట్లతో చేపడుతున్న అంబాభవానీ లిఫ్ట్ పనులు 20 శాతం, రూ.202కోట్లతో చేపడుతున్న కంబాలపల్లి లిఫ్ట్ పనులు పది శాతం పూర్తయినట్లు తెలిపారు.








లింగగిరి మేజర్ కాల్వలోకి దిగి నిరసన తెలుపుతున్న రైతులు, రైతు సంఘం నాయకులు

## లింగగిరి మేజర్‌కు సాగునీరు ఇవ్వాలి

- కాల్వలోకి దిగి రైతుసంఘం నాయకుల నిరసన

హుజూర్‌నగర్, ఆగస్టు 14 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరి మేజర్ కాల్వకు సాగునీటిని అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రైతులతో కలిసి మేజర్ కాల్వలో దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ లింగగిరి మేజర్ ద్వారా ఆరు వేల ఎకరాలకు సాగునీరు లభిస్తుందన్నారు. 9 కిలోమీటర్ల మేర కాల్వ విస్తరించి ఉందని, హుజూర్‌నగర్ పరిధిలో 3 కిలోమీటర్ల వరకు రాళ్లు, చెత్తాచెదారంతో నిండిపోయి ఉండడంతో ఆరు కిలోమీటర్లు నీరు రాని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రెండు సంవత్సరాల నుంచి సాగునీరు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం సాగర్‌లో నీళ్లు పుష్కలంగా ఉన్నా చివరి భూములకు నీరందని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి కాల్వకు మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు నీరు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు వీరబాబు, మురళి, సైదులు, హుస్సేన్, శ్రీను, వెంకటనారాయణ, వీరస్వామి, వెంకట్, నరసింహారావు, వెంకన్న, బాబు, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

రామగిరి, ఆగస్టు 14 : నల్లగొండ ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ బి.భిక్షపతి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కానుగుల నరసింహ బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య, వ్యాయామ విద్య, దృశ్య కళలు మరియు కళా విద్య అనే పోస్టులకు ఆయా అంశాల్లో అర్హత ఉండాలని తెలిపారు. అదేవిధంగా నల్లగొండలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో ఖాళీగా ఉన్న కంప్యూటర్ ఐసీటీ పోస్టును అతిథి అధ్యాపకులతో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అన్ని పోస్టులకు ఈ నెల 21లోగా పూర్తి బయోడేటాతో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 9949993723లో సంప్రదించాలని పేర్కొన్నారు.



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా త్రివర్ణ వెలుగుల్లో నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

## మళ్లీ తెరుచుకున్న క్రస్ట్ గేట్లు

- రెండు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నందికొండ, ఆగస్టు 14 : నాగార్జునసాగర్ జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతుండడంతో బుధవారం సాయంత్రం రెండు క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేశారు. సాగర్ జలాశయం సామర్థ్యం 590 అడుగులకు గానూ పూర్తిస్థాయిలో నిండడంతో ఎగువ నుంచి వస్తున్న 46,679 క్యూసెక్కుల వరదను అంతేస్థాయిలో కిందికి వదులుతున్నారు. స్పిల్‌వే మీదుగా 16,200 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7,611, కుడి కాల్వ ద్వారా 7,528, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,150, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. పైనుంచి వచ్చే వరద ఆధారంగా క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుందని ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. క్రస్ట్ గేట్ల ద్వారా ఈ నెల 5న నీటి విడుదల ప్రారంభం కాగా, 12 వరకు 8 రోజుల పాటు 174.82 టీఎంసీల నీటిని దిగువకు వదిలారు. వరద తగ్గడంతో సోమవారం మధ్యాహ్నం క్రస్ట్ గేట్లను బంద్ చేయగా.. మళ్లీ బుధవారం తెరిచారు.






## వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ



కోదాడలో వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ సభ్యులు, విద్యార్థులు

కోదాడ, ఆగస్టు 14 : 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కోదాడ పట్టణంలో బుధవారం వంద అడుగుల జాతీయ జెండాతో ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ సభ్యులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల ప్రారంభించారు. బస్టాండ్ నుంచి ఖమ్మం క్రాస్ రోడ్డు రాజీవ్ చౌరస్తా, వాయిల సింగారం రోడ్డు వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉజ్జిని రవీందర్‌రావు, రాష్ట్ర కో ఆర్డినేటర్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గుండా మధుసూదన్‌రావు, ప్యాట్రన్స్ గుండపునేని నాగేశ్వర్‌రావు, జగిని ప్రసాద్, సూర్యాపేట జిల్లా కో ఆర్డినేటర్ గోవిందా, నవీన్ పాల్గొన్నారు.

## ఒకరోజు ముందే సంతకాలు

- హాజరు రిజిష్టర్‌లో నేటి సంతకాలు నిన్ననే చేసిన పెంచికల్‌దిన్నె వైద్యాధికారి
- ఇద్దరు సిబ్బందికి ఆబ్‌సెంట్, ఒకరికి సీఎల్



పెంచికల్‌దిన్నె పీహెచ్‌సీ రిజిష్టర్‌లో ఒక్కరోజు ముందుగానే సంతకాలు చేసిన వైద్యాధికారి, సిబ్బంది

నేరేడుచర్ల, ఆగస్టు 14 : మండలంలోని పెంచికల్‌దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఒకరోజు ముందుగానే హాజరు రిజిష్టర్‌లో సంతకం చేశారు. ఇద్దరు సిబ్బందికి గైర్హాజరు, మరొకరికి సిక్ లీవ్ వేసిన వైనం చోటు చేసుకున్నది. పెంచికల్‌దిన్నె పీహెచ్‌సీ వైద్యాధికారి సీతామహాలక్ష్మి గురువారం విధులకు హాజరైనప్పుడు హాజరు రిజిష్టర్‌లో పెట్టాల్సిన సంతకాన్ని బుధవారమే పెట్టి వెళ్లారు. అంతేకాకుండా మరో ఇద్దరు సిబ్బంది గైరాజరైనట్లు, మరొకరు సిక్ లీవ్‌లో ఉన్నట్లు, కొంత మంది సిబ్బంది పేర్ల ఎదురుగా పెన్నుతో చిన్న చిన్న చుక్కలు పెట్టారు. ఈ విషయం తెలిసిన మీడియా ప్రతినిధులు బుధవారం మధ్యాహ్నం 3:15 గంటలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా.. వైద్యాధికారి సీతామహాలక్ష్మి లేరు. ఇప్పుడే బయటకు వెళ్లారని సిబ్బంది తెలిపారు. వైద్య సిబ్బంది నాలుగు గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉండగా.. వైద్యాధికారి ముందే వెళ్లిపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆసుపత్రిలో ఉన్న సీసీ కెమెరాలు పని చేయడం లేదు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో ప్రజలకు అందుబాటులో ఉండని వైద్యాధికారిపై చర్యలు తీసుకొని మరొకరిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి కోటాచలానికి ఫోన్ చేయగా.. సమస్య తన దృష్టికి రాగానే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రిజిష్టర్‌లో ఒకరోజు ముందుగానే సంతకం చేసిన ఫొటోను కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు పంపగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఈ డాక్టర్‌పై పలు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నామంటూ కాలయాపన చేశారు.





